క్లుప్తంగా

రేపు సర్వసభ్య సమావేశం

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 27న సర్వసభ్య సమావేశం పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు పీఏసీఎస్ సీఈఓ మద్దిలేటి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సంఘానికి సంబంధించి లావాదేవీలు, రుణాలు, తదితర విషయాలపై చర్చిస్తామని పేర్కొన్నారు. సంఘం పరిధిలోని సభ్యులు, రైతులు హాజరుకావాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అయిజ: విద్యుత్ పనులు మరమ్మతు కారణంగా 33 కేవీ ఫీడర్ పరిధిలో ఉన్న 33/11 కేవీ ఉప కేంద్రాలైన వెంకటాపురం, ఉప్పల, మాన్‌దొడ్డి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో ఆదివారం అంతరాయం ఉంటుందని ఏడీఈ గోవిందు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌కు సంబంధించిన వెంకటాపురం ఫీడర్ (33 కేవీ) విద్యుత్ స్తంభాలకు చెట్ల కొమ్మలు తాకుతున్నాయని వీటిని తొలగించనునట్లు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్లట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వర్షంతో రైతుల అవస్థలు

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాలలో శనివారం రాత్రి కురిసిన వర్షానికి మిర్చి రైతులు అవస్థలు పడుతున్నారు. పండించిన పంటను రైతులు కల్లాల్లో ఆరబెట్టుకున్నారు. అకస్మాత్తుగా వర్షం కురవడంతో మిర్చి తడిసింది. టార్పాలిన్లు, తట్లు అందుబాటులో లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రభుత్వం టార్పాలిన్లు సబ్సిడీపై సరఫరా చేయకపోవడంతో రైతుల పంటలు తడిశాయని పలువురు రైతులు వాపోయారు.

శిథిలావస్థలో మరుగుదొడ్లు



మల్దకల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మించిన మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఏడేళ్ల కిందట నిర్మించిన మరుగుదొడ్లు నిర్మాణ సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పేర్కొన్నారు. మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకోవడం విద్యార్థులు ఆరుబయటకు వెళ్లి మలవిసర్జన చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరుకున్న మరుగుదొడ్ల స్థానంలో కొత్తగా నిర్మించి సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

మల్దకల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని శనివారం ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. 84 మంది విద్యార్థులకు 77 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ నర్సింహులు, డిపార్ట్‌మెంటల్ అధికారి రాజేశ్వర్‌లు తెలిపారు.

నిర్వాహకులకు ప్రైజ్‌మనీ అందజేత



గట్టు: మండలంలోని గొర్లఖాన్‌దొడ్డిలో నిర్వహిస్తున్న బండలాగుడు పోటీలను శనివారం సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు బల్గెర హనుమంతు తిలకించారు. ద్వితీయ బహుమతి కోసం రూ.30,016లను నిర్వాహకులకు అందజేశారు. తిక్కతాత జాతర సందర్భంగా గొర్లఖాన్‌దొడ్డిలో రైతు సంబరాలను నిర్వహిస్తున్నారు. దాత హనుమంతును నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచు శంకరమ్మ, ఎంపీటీసీ బొజ్జయ్యనాయుడు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఇమాంసాబ్, మాజీ ఎంపీటీసీ వెంకటన్నగౌడ్, గ్రామస్తులు సుధాకర్‌గౌడ్, తిమ్మప్ప, కర్రెప్ప, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ జెడ్పీటీసీకి పరామర్శ



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని షేకుపల్లి గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ ఖగన్నాథరెడ్డి గుండెపోటుతో ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి శనివారం షేకుపల్లి గ్రామానికి చేరుకొని మృతుడు ఖగన్నాథరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

రోడ్డు ఉన్నా నిరుపయోగం

- బస్సు సౌకర్యం లేక విద్యార్థుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



సద్దలోనిపల్లి నుంచి నేతువానిపల్లికి కాలినడకన వెళ్తున్న విద్యార్థులు



బిజ్వారం నుంచి మల్దకల్ వెళ్లే రహదారి

మల్దకల్: పల్లెలు అభివృద్ధి చెందేందుకు రహదారుల నిర్మాణాలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గ్రామాలు ప్రగతి పథంలో నడిచేందుకు మట్టిరోడ్డు స్థానంలో బీటీ రోడ్డు నిర్మాణాలకు శ్రీకారం చుట్టుంది. గ్రామాల నుంచి మండల కేంద్రానికి అనుసంధానంగా బీటీ రోడ్లను నిర్మించింది. దీనికి తగిన నిధులు కేటాయిస్తూ సకాలంలో రోడ్ల నిర్మాణాలు పూర్తి చేసింది. వివిధ గ్రామాలకు రోడ్డు సౌకర్యం ఉన్నా బస్సు సౌకర్యం లేక ఆయా గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. కోట్ల రూపాయల నిధులు వృథా అవుతున్నాయని గ్రామస్తులు వాపోయారు. అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా రోడ్ల పరిస్థితి మారిందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాలకు రోడ్డు సౌకర్యం

మండలంలోని సద్దలోనిపల్లి నుంచి నేతువానిపల్లి వరకు ఎనిమిదేళ్ల కిందట రూ.కోటి నిధులతో బీటీ రోడ్డును ఏర్పాటు చేశారు. కుర్తిరావుల చెర్వు నుంచి అయిజ రోడ్డు వరకు, తాటికుంట నుంచి స్టేజీ వరకు, నాగర్‌దొడ్డి నుంచి అయిజ స్టేజీ వరకు, దాసరపల్లి నుంచి బిజ్వారం వరకు, పెద్దపల్లి నుంచి ఎల్కూరు మీదుగా విఠలాపురం మీదుగా అయిజ వరకు బీటీ రోడ్డు సౌకర్యం కల్పించారు.

బస్సు సర్వీసులు లేక..

బీటీ రోడ్డు నిర్మించిన గ్రామాలకు కూడా బస్సు సౌకర్యం లేక ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే అదనుగా భావించిన ప్రైవేట్ వాహనదారులు, అధిక చార్జీలు వసూలు చేస్తున్నారు. పరిమితికి మించి ప్రయాణికులను చేరవేస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధులు, పిల్లలు, మహిళలు గత్యంతరం లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు సౌకర్యం ఉన్న గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కరిస్తాం

బీటీ రోడ్డు ఉన్న గ్రామాలను పరిశీలిస్తాం. బస్సు సౌకర్యం కల్పనకు చర్యలు తీసుకుంటాం. వెంటనే ఆయా రూట్లకు బస్సు సర్వీసులను నడిపిస్తాం. ప్రజల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని సమస్య పరిష్కారానికి కృషి చేస్తా.

– శ్రీనివాస్, డిపో మేనేజర్, గద్వాల

ఇబ్బందులు పడుతున్నాం



సద్దలోనిపల్లి స్టేజీ నుంచి నేతువానిపల్లి వరకు బస్సు సౌకర్యం కల్పించాలి. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. రోడ్డు నిర్మాణాలు చేపట్టినా బస్సు సౌకర్యం లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. సద్దలోనిపల్లి స్టేజీ వరకు కాలినడకన వెళ్లి బస్సులు ఎక్కి వెళ్తున్నాం.

– పావని, అడవిరావల్‌చెర్వు

అధికారులు పట్టించుకోవడం లేదు



మల్దకల్ నుంచి కుర్తిరావులచెర్వు మీదుగా అయిజ వరకు బస్సు సౌకర్యం కల్పించాలని అధికారులకు విన్నవించాం. అయిజ– గద్వాలకు వెళ్లేందుకు 4కి.మీల దూరం కాలినడకన వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాఠశాలలు, కళాశాలల సమయంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– బుడ్డన్న, కుర్తిరావుల చెర్వు

గ్రామాల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

అలంపూర్: కలిసికట్టుగా గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. శనివారం పట్టణంలోని ఉపాధి హామీ కార్యాలయంలో మండల ప్రత్యేక జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన 15వ ఫైనాన్స్ నిధులపై సమావేశంలో చర్చించారు. గ్రామాలలో చేపట్టాల్సిన పనులను గుర్తింపునకు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అనంతరం జెడ్పీ చైర్ పర్సన్ మాట్లాడుతూ పల్లెల ప్రగతికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కట్టుబడిందన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ శంషాద్‌ఇస్మాయిల్, ఎంపీపీ బేగం, వైస్ ఎంపీపీ అనురాధ, ఎంపీడీఓ నాగేశాద్రి సూరి, కో–ఆప్షన్ సభ్యులు ఇబ్రహీం, ఎంపీటీసీ రజియా, జూనియర్ అసిస్టెంట్ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

శాంతినగర్: ప్రతి రోజు చిరుధాన్యాలు ఆహారంలో ఉండే విధంగా చూసుకోవాలని అంగన్‌వాడీ టీచర్ సలోమి అన్నారు. శనివారం వడ్డేపల్లి మండలంలోని రామాపురం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్ పక్షంలో భాగంగా విద్యార్థులకు చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ మాట్లాడుతూ కిశోరబాలికలు, బాలురు చిరుధాన్యాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ నాగేంద్రమ్మ, మల్లేశ్వరి, పరమేశ్వరి, ఆయాలు మున్నెమ్మ, వరలక్ష్మిలు పాల్గొన్నారు.

ఆర్థికసంఘం నిధులపై ప్రత్యేక సమావేశం



హాజరైన ఎంపీపీ మరియమ్మ

రాజోళి: ఆర్థిక సంఘం 2023–2024 సంవత్సరానికి నిధుల వినియోగంపై సర్వసభ్య సమావేశం నిర్వహించారు. శనివారం ఎంపీపీ మరియమ్మ అధ్యక్షతన మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. 15 ఆర్థిక సంఘం ద్వారా 2023–24 సంవత్సరానికి రూ.24.48 లక్షలతో చేపట్టనున్న పనులను ప్రతిపాదించారు. అందులో రూ.14.69 లక్షలు డ్రెయినేజీ పనులు, రూ.9 లక్షలతో పాఠశాల నిర్మాణాలు, మరమ్మతులు కోసం కేటాయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రేణుక, జెడ్పీకోఆప్షన్ సభ్యుడు నిషాక్, ఎంపీడీఓ గోవిందు రావు తదితరులు పాల్గొన్నారు.

చైతన్య యాత్రను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న వెంకటస్వామి

అయిజ: జన చైతన్య యాత్రను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి అన్నారు. శనివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాయలంలో జన చైతన్య యాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సంక్షేమం, మతసామరస్యం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయంకోసం సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జన చైతన్య యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 27న జనచైతన్య యాత్ర గద్వాల చేరుకుంటుందని, సాయంత్రం గద్వాల పాత బస్టాండ్ సెంటర్‌లో వైఎస్సార్ సర్కిల్ వద్ద బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వర్, శ్రీను, సవారి, నాగరాజు, రాముడు, భీమన్న, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి పాఠశాలలో ఓపెన్‌హౌస్



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో గల సరస్వతి పాఠశాలలో శనివారం కరస్పాండెంట్ గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఓపెన్‌హౌస్, గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓపెన్‌హౌస్‌లో భాగంగా విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రదర్శనలను ఆయన తిలకించి మాట్లాడారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఓపెన్‌హౌస్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తరగతి గదిలో విద్యార్థులు నేర్చుకున్న పాఠ్యాంశాలను ఎంత వరకు అర్థమయ్యిందో వివిధ చార్టుల ద్వారా తెలిపితే విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని అంచనా వేయొచ్చన్నారు. అదేవిధంగా కిండర్ విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఆయా విభాగాల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చిన విద్యార్థులను పాఠశాల బృందం అభినందించి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ వెంకటేశ్వర్లు, సంధ్య, నందిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని కొండేరు గ్రామానికి చెందిన మంద కుంటి సవరన్న అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోతురాజు శంకరమ్మ సేవాదళం సభ్యులు శనివారం గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పోతురాజు సోమనాద్రి సూచన మేరకు పోతురాజు శంకరమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులకు రూ. 5000 ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సేవాదళం సభ్యులు నాగన్న, ఉశేన్, తేజ, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం




అలంపూర్ రూరల్: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి ఏమెలమ్మ అన్నారు. శనివారం పోషణ అభియాన్‌లో భాగంగా పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్ న్యూప్లాట్స్, బాలికల ఉన్నత పాఠశాలలో పోషకాహార లోపం లేని సమాజాన్ని నిర్మిద్దామని విద్యార్థులతో అంగన్‌వాడీ టీచర్లు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఏమెలమ్మ మాట్లాడుతూ తాజా ఆకుకూరలు తీసుకోవడం వల్ల రక్తహీనత నివారించవచ్చన్నారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు

శిశుమందిరాలు సంస్కృతికి నిలయాలు

అమరచింత: సరస్వతీ శిశుమందిరాలు సంస్కృతి సాంప్రదాయాలకు నిలయాలని మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్‌రెడ్డి అన్నారు. పట్టణంలో శనివారం శ్రీసరస్వతి శిశుమందిరంలో నిర్వహించిన వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

కబ్జా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి



అమరచింత: పట్టణంలోని 4వ వార్డులో ఓ వ్యక్తి రోడ్డును ఆక్రమించి రహదారిపై మట్టిని ఉంచాడని కాలనీవాసులు శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. తమ సమస్యను పరిష్కరించే వరకు కదలమంటూ రెండో రోజు నిరసన చేపట్టారు. కాలనీ ప్రజలు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా ఉన్న రహదారిని తన ఇంటి స్థలం అంటూ కబ్జా చేసిన వ్యక్తిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలకు నిత్యం ఉపయోగపడే రహదారికి సీసీ వేయించాలని కోరారు. పలు సందర్భాలలో మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు ఇస్తున్నా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రహదారిపై వేసిన మట్టిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం కాలనీవాసులతో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ మహ్మద్ ఖాజా మాట్లాడారు. నకిలీపత్రాలు సృష్టించి తప్పుడు విధానాలతో ఇంటి స్థలం అంటూ రహదారిని రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. విషయాన్ని సబ్‌రిజిస్ట్రార్‌కు విన్నవించామని ఈనెల 28 నాటికి కాలనీ ప్రజల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సింధు, రాజ్ కుమార్ అబ్రహం, శ్యాంసుందర్, భాస్కర్, స్వాతి, పద్మమ్మ, సరోజ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయిలో నాలుగు అవార్డులు



మానవపాడు సర్పంచ్‌లను సన్మానిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి, జెడ్పీ చైర్‌పర్సన్ సరిత



జిల్లా కేంద్రంలో సర్పంచ్‌లకు అవార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

మానవపాడు: జిల్లాస్థాయిలో జాతీయ పంచాయతీ అవార్డుల కార్యక్రమంలో మండలంలోని పల్లెపాడు, చెన్నిపాడు, మానవపాడు, చంద్రశేఖర్‌నగర్ గ్రామాలకు వివిధ కేటగిరిలో నాలుగు అవార్డులకు ఎంపికయ్యారని ఎంపీడీఓ రమణరావు తెలిపారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ వల్లూరు క్రాంతి, జెడ్పీ చైర్‌పర్సన్ సరిత , ఎమ్మెల్యేలు వీఎం అబ్రహం, కృష్ణమోహన్‌రెడ్డిలు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ప్రశంసాపత్రాలు, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ అశోక్‌రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: జాతీయ పంచాయతీ జిల్లా అవార్డుకు ఉండవెల్లి పంచాయతీ ఎంపికైంది. ఇందులో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ వల్లూరు క్రాంతి, జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఎమ్మెల్యే అబ్రహంలు సర్పంచు రేఖ, పంచాయతీ కార్యదర్శి అశోక్‌లకు అవార్డు అందజేశారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ఎదగాలని ప్రజాప్రతినిధులు, అధికారులు ఆకాంక్షించారు.

గట్టు: గంగిమాన్‌దొడ్డి గ్రామం జాతీయ పంచాయతీ జిల్లా అవార్డు లభించింది. శనివారం జిల్లా కేంద్రంలో గంగిమాన్‌దొడ్డి సర్పంచు నర్సమ్మకు పంచాయతీ కార్యదర్శి నిరేష్‌కుమార్‌ని కలెక్టర్ వల్లూరు క్రాంతి, జెడ్పీ చైర్ పర్సన్ సరిత, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ విజయానాయక్‌లు జాతీయ పంచాయతీ అవార్డు పురస్కారాన్ని అందజేశారు. జిల్లా స్థాయిలో పవర్ టీ ఫ్రీ విభాగంలో గంగిమాన్‌దొడ్డి పంచాయతీకి అవార్డు లభించింది. జిల్లా స్థాయిలో 3వ పంచాయతీగా, మండల స్థాయిలో మొదటి పంచాయతీగా గంగిమాన్‌దొడ్డి పంచాయతీ నిలిచి అవార్డును అందుకుంది. అవార్డు రావడంపై ఎంపీపీ విజయ్‌కుమార్, కేటిదొడ్డి జెడ్పీటీసీ రాజశేఖర్, ఎంపీడీఓ చెన్నయ్యలు సర్పంచు, కార్యదర్శులను ప్రత్యేకంగా అభినందించారు.

రైతు సంక్షేమానికి ప్రాధాన్యం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: రైతు సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఇటీవల కేటీదొడ్డి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన మహిళా రైతు నర్సమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో రైతుబీమా మంజూరు అయ్యింది. శనివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబసభ్యులకు రూ.5 లక్షల బీమా చెక్కు అందజేశారు. కార్యకరమంలో నాయకులు పాల్గొన్నారు.

ధరూరు: మండలంలోని ఉప్పేరు పునరావాస గ్రామంలో ఈ నెల 27న శివాలయం ప్రారంభం, గణపతి, శివలింగం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శనివారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆలయానికి సంబంధించిన శిలాఫలకాన్ని గ్రామస్తులతో కలిసి ప్రాంభించారు. అంతకు ముందు వాస్తు పూజ, ధ్వజారోహణం, అంకురార్పణ, జలాధివాసం తదితర పూజా కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో దేవాలయాలు ఉండడం ద్వారా ప్రజల్లో భక్తి శ్రద్ధలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీటీసీ రేణుక, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సర్వారెడ్డి, ప్రభాకర్‌గౌడ్, హనుమంతురెడ్డి పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాలతో ఒరిగేదేమీలేదు



మాట్లాడుతున్న శేక్షావలి ఆచారి

అయిజ: రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు ప్రజల నుంచి వ్యతిరేకత ఎక్కువవుతోందని దీనిని దృష్టిలో ఉంచుకొని ఆత్మీయ సమ్మేళనాలు పేరుతో సమావేశాలు నిర్వహించినా ఒరిగిందేమీలేదని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ కార్యదర్శి శేక్షావలి ఆచారి అన్నారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని పులికల్, సింధనూరు, రాయచూర్, ఎక్లాస్‌పురం రోడ్ల నిర్మాణం ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. మండల కేంద్రానికి డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయకపోవడం ఆగ్రహం వ్యక్తం చేశారు. బింగిదొడ్డి చెరువును మినీ ట్యాంక్‌బండ్ చేసేందుకు విడుదల చేసిన రూ. 4 కోట్లు నిధులు పక్కదారి పట్టించారని విమర్శించారు. ఆర్డీఎస్ గండితో సింధనూరులో నష్టపోయిన 150 మంది రైతులకు పంటనష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండలంలో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ఠవేస్తే ఆత్మీయ సమ్మేళనాలు ఎందుకు అని ప్రశ్నించారు. కార్యక్రమంలో జయన్న, సాంబశివుడు, గాల్‌రెడ్డి, మద్దిలేటి, పాండురంగ రాజు, లక్ష్మన్న, మధు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన బెటాలియన్ సిబ్బంది



ఆర్థికసాయం అందజేస్తున్న కమాండెంట్

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి బెటాలియన్‌లో 1995వ బ్యాచ్‌కు చెందిన హెడ్‌కానిస్టేబుల్ పర్వతాలు కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ప్రస్తుతం అతని ఆరోగ్యం క్షీణించడంతో ఉద్యోగం చేయలేని స్థితిలో ఉన్నాడు. విషయం తెలుసుకున్న 1995 బ్యాచ్‌కు చెందిన పోలీస్ సిబ్బంది రూ.లక్ష పోగు చేశారు. ఈ సందర్భంగా కమాండెంట్ రామ్ ప్రకాష్ శనివారం బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పటాలం అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు



కేటీదొడ్డిలో ఆలయంలో పూజలు నిర్వహించిన ఆలయ చైర్మన్ కుటుంబ సభ్యులు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అదే విధంగా సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావుల చెర్వు గట్టు తిమ్మప్ప, శేషంపల్లి శివసీతరామస్వామి, పాల్వాయి చింతలాముని నల్లారెడ్డిస్వామి, అమరవాయి , బిజ్వారం, నాగర్‌దొడ్డి , తాటికుంట, ఎల్కూరు గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆదిశిలా క్షేత్రం, సద్దలోనిపల్లి కృష్ణస్వామి ఆలయాల వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ధీరేంద్రదాసు, చంద్రశేఖర్‌రావు, బాబురావు, నాగరాజు శర్మ, వాల్మీకీ పూజారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురంలో వెలసిన పాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారికి అభిషేకం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు స్వామివారికి దాసంగాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెంట్రామిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.